క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శ్రీనివాస కల్యాణం



శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న పండితులు, కల్యాణంలో పాల్గొన్న యజ్ఞకర్తలు

పెదపూడి: సంపర గ్రామంలో జరుగుతున్న శ్రీరామ సప్తాహాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్రీనివాస కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వైఖానస పండితుడు వాడపల్లి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో పది మంది పండితులు తిరుపతిలో జరిగే విధంగా కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు కల్యాణాన్ని కనులారా తిలకించారు. పండితుడు హనుమంతాచార్యులు, ఫణిశ్రీ దంపతులు యజ్ఞకర్తలుగా కూర్చున్నారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదం, కల్యాణ తలంబ్రాలు పంపిణీ చేశారు. భగవాన్ సత్యసాయి భజన భక్త మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉపాధి పనులు ప్రారంభం

కోరుకొండ: మండలంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా బూరుగుపూడిలోని కరకుంట చెరువులో పూడికతీత పనులను ప్రారంభించారు. గ్రామ నాయకుడు కంటే నాగ కేశవ రావు కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. 67 మంది కూలీలు పనికి హాజరయ్యారు. కాగా.. మండలంలోని 22 గ్రామాల్లో 16,746 మంది కూలీలు పనులకు వస్తున్నారు.

త్వరలో ధాన్యం కొనుగోలు

సీతానగరం: మండల గ్రామాల్లో రైతులు పండించిన ధాన్యాన్ని త్వరలో కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయాధికారి కె.సూర్య రమేష్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వరి పంట అధిక వర్షాలకు దెబ్బతినడంతో దాళ్వా పంట ముందుగా వేయడం జరిగిందన్నారు. దానితో పంట ముందుగానే కోతకు వచ్చిందన్నారు. దీనిపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

పారిశుధ్య కార్మికులకు రూ.26 వేల జీతం ఇవ్వాలి

పెదపూడి: పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.26 వేల జీతం ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా పంచాయతీ వర్కర్ల యూనియన్ మండల స్థాయి సర్వసభ్య సమావేశాన్ని గురువారం రామేశ్వరంలో నిర్వహించారు. యూనియన్ జిల్లా నాయకుడు రాగుల రాఘవులు దీనికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు ప్రతి నెలా 5వ తేదిన జీతాలు, హెల్త్ అలవెన్స్‌లు చెల్లించాలన్నారు. సబ్బులు, ఆయిల్ ఇవ్వాలన్నారు. ఏడాదికి రెండు జతల యూనిఫాం, రెండు జతల చెప్పులు, ఒక రెయిన్ కోటు కోరారు. ఒక్కో పంచాయతీలో ఒక్కో విధంగా కార్మికులకు జీతాలు ఇవ్వడం సరి కాదన్నారు. సమావేశంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు గుబ్బల ఆదినారాయణ, యూనియన్ ప్రతినిధులు మేడపాటి గోపాలకృష్ణ, బంగారు ఆదినారాయణ, రాగుల మరిసిల్లి, లోవరాజు, జాన్, మురళీ పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



మర్రిపూడిలో బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

రంగంపేట: మండల పరిధిలోని మర్రిపూడిలో 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. దీన్ని తయారు చేసిన ఏడిద సూరిబాబును అరెస్టు చేశామన్నారు. ఈ దాడిలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఈఎండీపీ జిల్లా ఎక్స్‌పో

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన (ఈఎండీపీ) ఎంటర్ ప్రెన్యూరియల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం జిల్లా ఎక్స్‌పో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో 10 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. జిల్లా మేనేజర్ సీహెచ్ ఉదయ కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా డీఈవో కంది వాసుదేవరావు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ జీవీఎస్ఎస్ నెహ్రూ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ సామర్థ్యాలను పెంపొందించేందుకు ఈ ప్రదర్శన నిర్వహించామన్నారు. జిల్లా సమగ్ర శిక్షా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఎ.గౌరీ శంకరరావు మాట్లాడుతూ విద్యార్థులు చక్కటి ప్రతిభ ప్రదర్శించారని, భవిష్యత్తులో ఎక్కువ మంది ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. జిల్లా సమగ్ర శిక్షా సీఎంవో శ్రీనివాస్ మాట్లాడుతూ ఈఎండీపీ ప్రోగ్రామ్ విద్యార్థుల్లో వ్యాపార మనస్తత్వాన్ని, సృజనాత్మక ఆలోచనను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

పింఛన్.. టెన్షన్..

- కొత్త పింఛన్లు ఎప్పుడిస్తారో..
- అర్హుల ఎదురుచూపులు
- ఓపెన్ కాని వెబ్ సైట్
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు



ఊలపల్లిలో సచివాలయం, పంచాయతీ కార్యాలయం

బిక్కవోలు: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అనేక హామీలను గుప్పించారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చారు. తీరా గద్దెనెక్కాక తమను గెలిపించిన ప్రజల సంక్షేమాన్ని మర్చిపోయారు. ముఖ్యంగా కొత్త పింఛన్లు మంజూరుకాకపోవడంతో అర్హులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం అందజేసే సామాజిక పింఛన్లే ఆధారం. ప్రతి నెలా ఒకటో తేదీ కోసం వీరంతా ఆశగా ఎదురు చూస్తుంటారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్ సొమ్మును రూ.3 వేలకు పెంచి ఆదుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఫింఛన్‌ను రూ.4 వేలకు పెంచింది. అయితే కొత్తగా ఒక్కరికి కూడా పింఛన్ మంజూరు చేయలేదు.

కొత్త పింఛన్ల మాటే లేదు

కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు పది నెలలు పూర్తవుతోంది. ఇప్పటి వరకూ కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకోవడానికి కూడా అవకాశం ఇవ్వలేదు. దీంతో అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. గతేడాది అక్టోబర్ ఒకటి నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. కానీ ఇంత వరకు ఒక్క పింఛన్ కూడా ఇవ్వలేదు. అసలు దరఖాస్తు చేసుకోవడానికి వైబ్ సైట్ కూడా తెరవలేదు. నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో సుమారు 2 వేల మందికి పైగా 60 ఏళ్ల నిండినవారు ఉన్నారు. ఇక 50 ఏళ్లు దాటిన వారు మరో 4 వేల మంది ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఎదురు చూపులు

అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఎదురు చూపులు తప్పడం లేదు. దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలకు రోజు పదుల సంఖ్యలలో అర్హులు వెళుతున్నారు.

గత ప్రభుత్వంలో పక్కాగా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పక్కాగా పింఛన్లు అందించేవారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా వలంటీర్లు దరఖాస్తు పూర్తి చేసి సచివాలయాల్లో ఇస్తే పింఛన్ల మంజూరయ్యేవి. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగింది. కానీ నేడు ఈ పరిస్థితి మారిపోయింది. కూటమి ప్రభుత్వం పింఛన్ల వెబ్‌సైట్‌ను పూర్తిగా నిలిపివేసింది. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. వైబ్ సైట్ తెరవకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

50 ఏళ్లకే పింఛన్ హామీ గాలికేనా..

సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామని చెప్పిన హామీ గాలికి వదిలేశారని బీసీ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. బీసీలకు సమన్యాయం చేస్తామని చెప్పిన హామీలు ఏమయ్యామని అడుగుతున్నాయి.

నియోజకవర్గంలో వివరాలు

మండలం	పింఛన్ దారులు
అనపర్తి	10,132
బిక్కవోలు	10,482
రంగంపేట	8,735
పెదపూడి	10,350

హామీలు నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో చంద్రబాబు కూటమి ప్రభుత్వం విఫలమైంది. ప్రభుత్వం ఏర్పడి పది నెలలైనా హామీలను నెరవేర్చలేదు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఇప్పటి వరకు వెబ్ సైట్ కూడా ఓపెన్ కాలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే వలంటీర్లు ఇంటి వద్దకు వెళ్లి దరఖాస్తు చేయించేవారు.

– పడాల దుర్గారెడ్డి, పందలపాక

ప్రభుత్వ ఆదేశాలు రావాలి



ప్రభుత్వం జీఓ ప్రకారం 2024 నవంబర్ ఒకటో తేదీ నుంచి వృద్ధాప్య పింఛన్ తీసుకునే వ్యక్తి ఒకటి నుంచి 15వ తేదీల మధ్య మరణిస్తే మరుసటి నెలకే ఆయన భార్యకు వితంతువు పింఛను మంజూరవుతుంది. 16 నుంచి 30వ తేదీ మధ్య మరణిస్తే తదుపరి నెల కాకుండా మరో నెలలో పింఛన్ మంజూరవుతుంది. కొత్త పింఛన్లు దరఖాస్తు తీసుకునేందుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి.

– వి.శ్రీనివాస్, ఎంపీడీవో, బిక్కవోలు

తడి, పొడి చెత్తపై అవగాహన



గంద్రేడులో మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. గంద్రేడు గ్రామంలో సంపద తయారీ కేంద్రం వద్ద గురువారం మహిళలకు తడి, పొడి చెత్తను వేరు చేయడంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తను డస్ట్‌బిన్లలో వేసి క్లాప్ మిత్రలకు ఇవ్వాలన్నారు. వారు ఆ చెత్తను ఇక్కడకు తీసుకువచ్చి తడి చెత్తను ఎరువుగా, పొడి చెత్తను రీసైకిల్ చేస్తారన్నారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి రేవతి, సర్పంచ్ కుడిపూడి మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

ఏపీఓగా సత్యనారాయణ



కోరుకొండ: ఏపీఓగా జె.సత్యనారాయణ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఆయన కడియం మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఏపీఓగా పనిచేసిన భ్రమరాంబిక కడియానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. ఎండల నేపథ్యంలో కూలీలను ముందుగానే ఇంటికి పంపుతున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురి అరెస్ట్



అనపర్తి పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న సీఐ సుమంత్

పెదపూడి: వ్యక్తి దాడి చేసి మొబైల్, నగదు లాక్కున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించినట్లు అనపర్తి సీఐ వీఎల్‌వీకే సుమంత్ తెలిపారు. ఈ మేరకు గురువారం అనపర్తి పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆ ప్రకారం.. అనపర్తిలోని కరివేపాకుపేటకు చెందిన ఆకుల సురేష్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన ఈ నెల 2వ తేది రాత్రి 11.45 గంటల సమయంలో పూరీ – తిరుపతి రైలు ఎక్కడానికి ఇంటి నడుచుకుంటూ వెళుతున్నాడు. అయితే సురేష్‌ను స్థానికంగా నివాసముంటున్న పిల్లి కార్తిక్, అతడి స్నేహితులు అయినవిల్లి వినయ్, అయినవిల్లి అంజి వెంబడించారు. అకారణంగా దుర్భాషలాడుతూ ముఖం, చేతులపై పిడిగుద్దులు గుద్ది మొబైల్‌ను లాక్కున్నారు. వెంటనే సురేష్ పరుగెత్తుకుంటూ తన ఇంటికి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఆ ముగ్గురూ అక్కడితో ఆగకుండా సురేష్ ఇంటికి వెళ్లి తలుపులు తక్షణం తెరవాలి లేకుంటే చంపుతామని బెదిరించారు. దీంతో భయాందోళనకు గురైన సురేష్ భార్య తలుపులు తెరవగా లోపలికి ప్రవేశించారు. పిల్లి కార్తిక్ తన జేబులోంచి చాకు బయటకు తీసి కేకలు వేస్తే చంపుతానని హెచ్చరించాడు. ఆకుల సురేష్ పీక మీద చాకు పెట్టి నగదు ఇస్తే వదిలేస్తామని భయపెట్టారు. ఆ సమయంలో తమ వద్ద రూ.1500 ఉన్నాయంటూ సురేష్ వారికి ఇవ్వగా ఆ నగదు లాక్కుని వెళ్లిపోయారు. ఈ ఘటనలో సురేష్, అతడి భార్యకు రక్తపు గాయాలయ్యాయి. అనంతరం బాధితుడు సురేష్ ఫిర్యాదుపై ఎస్సై శ్రీను నాయక్ కేసు నమోదు చేయగా సీఐ సుమంత పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద ముగ్గురు నిందితులు ఉన్నారన్న సమాచారంతో ఎస్సై నాయక్, అదనపు ఎస్సై బి.దుర్గాప్రసాద్ సిబ్బంది దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో పిల్లి కార్తిక్ 2024 సెప్టెంబర్ రెండో వారంలో అర్ధరాత్రి 12 గంటల సమయంలో మద్యం తాగి కరివేపాకుపేటలో నివాసం ఉంటున్న బచ్చు సత్యవతి ఇంటిలోకి ప్రవేశించాడు. ఆమె చేతుల కున్న గాజులను బంగారు గాజులు అనుకుని అపహరించుకుపోయాడు. అలాగే 2023లో గంజాయి కేసులో ముద్దాయి అని, అప్పుడు మైనర్‌గా ఉన్నాడదన్నారు. కాగా.. నిందితుల నుంచి నగదు, చాక్, మొబైల్, రోల్డ్ గోల్డ్ గాజులు రికవరీ చేసి, అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు.

నోడల్ అధికారుల నియామకం

బిక్కవోలు: మండలంలోని ప్రతి సచివాలయంలో జరిగే ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం ప్రతి పంచాయతీకి ఒక నోడల్ అధికారిని నియమించినట్లు ఎంపీడీవో వి.శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఆ ప్రకారం.. ఆర్ఎస్ పేట, బిక్కవోలు గ్రామాలకు ఎంపీడీవో వి.శ్రీనివాస్, బలభద్రపురానికి తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ, రంగాపురానికి వ్యవసాయశాఖ అధికారి శామ్యూల్ జాన్, ఆరికిరేవులకు హౌసింగ్ ఏఈ వి.వనమయ్య, కొంకుదురుకు పంచాయతీ విస్తరణాధికారి జాన్ మిల్టన్, తొస్సిపూడికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.సాయి కుమార్, కొమరిపాలేనికి పీపీ రామిరెడ్డి, మోళ్లూరుకు జి.అగస్టీన్ కుమార్, పందలపాకకు సీహెచ్‌వీ సత్యనారాయణ, ఊలపల్లికి కె.పూర్ణచంద్రరావు, ఇలపల్లికి డీవీ ప్రణీత్, కాపవరానికి ఎస్.ప్రభుకృష్ణ నియమితులయ్యారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

సీతానగరం: మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని రాజమహేంద్రవరం రూరల్ ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. మిర్తిపాడు 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ కోసం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. ఆ సమయంలో మిర్తిపాడు, ఉండేశ్వరపురం, బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామాలకు, అలాగే వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ ఉండదన్నారు.

లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: బలభద్రపురంలోని లక్ష్మీగణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో నల్లమిల్లి వెంకటరెడ్డి, కొవ్వూరి సత్తిబాబు, కొవ్వూరి వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ ధాన్యానికి డబ్బులు ఎక్కడ!



కోరుకొండ మండల సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కోరుకొండ: మండల సర్వసభ్య సమావేశంలో రైతుల సమస్యలు ప్రస్తావనకు వచ్చాయి. వీటిపై అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. ఖరీఫ్ సీజన్‌లో విక్రయించిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు రైతులకు అందలేదని, మామిడి, జీడితోటల రైతుల పంటకు బీమాను వర్తింపజేసే అవకాశం ఉందా అని ప్రశ్నించారు. అధికారులు సమాధానమిస్తూ ఆన్‌లైన్ ప్రక్రియలో నమోదు కాని వారికి ధాన్యం అమ్మిన డబ్బు జమ కాదన్నారు. మండలాధ్యక్షులు ఉల్లి వీర వెంకట సత్యసూర్యకుమారి అధ్యక్షతన ఈ సమావేశంలో జరిగింది. ఎంపీడీఓ బత్తిన అశోక్ కుమార్ మాట్లాడుతూ మండలంలో అన్ని శాఖల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. రైతు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కొందరు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ దోసకాయలపల్లికి చెందిన రైతులు ఖరీఫ్ సీజన్‌లో అమ్మిన ధాన్యానికి డబ్బులు రాలేదని తెలిపారు. గాదరాడ సర్పంచ్ దూది కాంతారావు మాట్లాడుతూ మామిడి తోటల యజమానుల నుంచి రూ.2 వేలు, జీడి తోటల రైతుల నుంచి రూ.1,500 కట్టించుకున్నందున వారికి బీమా వర్తింపజేస్తారా అని ప్రశ్నించారు. దీనికి అధికారులు చర్యలు తీసుకుంటామన్నారు. జల్‌జీవన్‌మిషన్ పథకం పేరిట జరుగుతున్న పనులపై ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తంచేశారు. గాదరాడ, కణుపూరు, రాజవరం తదితర గ్రామాల్లో వేసవి రీత్యా చేతిపంపులను త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎక్సైజ్ శాఖ సీఐ శ్రీనివాస బాలాజీ మాట్లాడుతూ సారా నిర్మూలనకు నిర్వహిస్తున్న నవోదయం 2.0 కార్యక్రమాన్ని వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు బొరుసు నాగమణి, కొయిడాల స్వర్ణకుమారి, నాయకులు ఉల్లి బుజ్జిబాబు, వ్యవసాయశాఖ ఏడీ మల్లికార్జునరావు, మండల పరిషత్ కార్యాలయ ఏవో శామ్యూల్ సతీష్, ఎంఈఓ కుశలవదొర, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రాల్లోకి ప్రయోగాల ఫలితాలు



మొక్కజొన్న సాగుపై పోస్టర్ ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

రాజానగరం: ప్రయోగశాలలో వచ్చిన ఫలితాలను క్షేత్రాల్లోకి తీసుకువెళ్లడానికి ఏరువాక కేంద్రం కృషి చేస్తుందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ అన్నారు. దివాన్ చెరువులోని ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి సమన్వయ సంఘ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెగుళ్ల బెడద పెద్దగా లేని, అధిక దిగుబడులు అందించే నూతన వంగడాలను రూపొందించడం, వ్యవసాయానికి అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించడం ద్వారా అన్నదాతల ఆర్థిక పురోభివృద్ధికి పనిచేస్తున్నామన్నారు. వచ్చే సార్వా, దాళ్వా సీజన్లకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా ముందస్తుగానే రైతులకు, వీఏఏలకు అందించాలన్నారు. దివాన్ చెరువు ఏరువాక కేంద్రం 2024–25లో నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన వివరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే మొక్కజొన్న సాగుపై పోస్టర్ విడుదల చేశారు. మారుటేరు పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ టి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ప్రతినిధులు, సంఘ సభ్యులు, అభ్యుదయ రైతులు ప్రసంగించారు.

వినాయకునికి వెండి ఆభరణాల సమర్పణ



స్వామివారికి వెండి ఆభరణాలను అలంకరిస్తున్న శ్రీనివాస్ తదితరులు

సీటీఆర్ఐ: స్థానిక గణేష్‌చౌక్‌లోని వినాయక ఆలయానికి కడియపులంకకు చెందిన ఆలా శ్రీనివాస్, ఆలా రోహన్, కుటుంబ సభ్యులు తమ తండ్రి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం గురువారం వెండి వస్తువులు సమర్పించారు. స్వామివారికి వెండి కిరీటం, తొండం, కర్ణాభరణాలు అందజేశారు. వాటికి అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి స్వామివారికి అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధి చింతా చలపతి, మాజీ కార్పొరేటర్లు కొండేటి భీమారావు, ద్వారా పార్వతి సుందరి, హరిహర మహా క్షేత్రం ఆలయ చైర్మన్ మార్గాన్ని సత్యనారాయణ మాట్లాడారు. వెండి ఆభరణాలు అందజేసిన దాత శ్రీనివాస్‌కు ఆలయ కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో పడాల విజయ భాస్కర్, తిరుమలశెట్టి భాస్కర్, డాక్టర్ బళ్లా శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బళ్లా సత్యవతి, రాజమండ్రి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి, గణేష్ చౌక్ యూత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరండి



విద్యార్థులకు పోస్టర్లు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు

రంగంపేట: పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరాలని అధ్యాపకులు కోరుతున్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని రంగంపేట, చంద్రేడు, దొడ్డిగుంట, వడిశలేరు, సింగంపల్లి, ఈలకొలను, దొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను వారు సందర్శించారు. విద్యార్థులకు, ప్రధానోపాధ్యాయులకు పోస్టర్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అన్ని వసతులు ఉన్నాయన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభమవుతాయని తెలిపారు.

200 మందికి కంటి పరీక్షలు



కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న విజయవాడ మాజీ మేయర్ జంధ్యాల శంకర్

రాజమహేంద్రవరం రూరల్: కోలమూరులోని కిర్లంపూడి మెసోనిక్ టెంపుల్ లాడ్జి ప్రాంగణంలో శృంగేరి జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి 75వ జన్మదినోత్సవం సందర్భంగా గౌతమీ నేత్రాలయం ఆధ్వర్యంలో గురువారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని విజయవాడ మాజీ మేయర్ డాక్టర్ జంధ్యాల శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 200 మంది రోగులను పరీక్షలు జరిపారు. అర్హులైన వారికి ఉచిత ఆపరేషన్లు చేస్తామని, కళ్లజోళ్లు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడుతూ గౌతమీ నేత్రాలయం చైర్మన్ డాక్టర్ వీకే రాజు అంధత్వ రహిత బాలల సమాజం కోసం చేస్తున్న సేవలను కొనియాడారు. శ్రీశృంగేరి శారదా పీఠం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. మాసోనిక్ లాడ్జి కార్యదర్శి రాధాకృష్ణ, ప్రముఖ న్యాయవాది, సీనియర్ మాసన్ మద్దూరి శివ సుబ్బారావు, గౌతమీ నేత్రాలయ ఎండీ వీవీ కుమార్, శారదా పీఠం ధర్మాధికారి వేలూరి బాలాజీ, వైద్యులు డాక్టర్ సంజు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు పొక్లెయిన్ల సీజ్

రాజానగరం: మండలంలోని కొత్తతుంగపాడులో నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు చేస్తున్న ప్రాంతంలో భూగర్భ, రెవెన్యూ శాఖల అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. అనుమతులు లేకుండా గ్రావెల్ త్రవ్వకాలు చేస్తున్న నాలుగు పొక్లెయిన్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా మైనింగ్ శాఖ అధికారి డి.ఫణి భూషన్‌రెడ్డి మాట్లాడుతూ పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి, బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అవగాహన

కంబాలచెరువు: స్థానిక జాంపేట లూథరన్ హైస్కూల్లో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ హ్యూమన్ రైట్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పదో తరగతి తర్వాత అందుబాటులో ఉండే వివిధ కోర్సులను వివరించారు. నివ్య ఒకేషనల్ జూనియర్ కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్ పి.ఎర్నెస్ట్ మోజెస్ మాట్లాడుతూ జనరల్ కోర్సులు, ఒకేషనల్ కోర్సుల వివరాలు, వాటి పరీక్షా విధానం తెలిపారు. కార్యక్రమంలో లూథరన్ హైస్కూల్, షాడే గరల్స్ హైస్కూల్, చున్నీలాల్ జాజు, రోటరీ మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులు, హ్యూమన్ రైట్స్ క్లబ్ లీడర్లు శ్రావణి, స్వాతి, అనూష, కావేరి, లక్ష్మి పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

కోరుకొండ: కోరుకొండ ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలోని గోకవరం మండలం రంపయర్రంపాలేనికి చెందిన ఇద్దరిని 50 లీటర్ల సారా తరలిస్తుండగా అరెస్టు చేసినట్టు సీఐ శ్రీనివాస బాలాజీ తెలిపారు. వారి నుంచి మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరు పర్చగా, రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



స్టార్టప్‌ను ప్రారంభిస్తున్న చైతన్యరాజు

రాజానగరం: వినూత్న ఆలోచనలతో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునే ఔత్సాహికులకు పూర్తి సహకారం అందిస్తామని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు) తెలిపారు. ఎంబీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న పది మంది విద్యార్థులు రూపొందించిన డిజిటల్ మార్కెటింగ్ స్టార్టప్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు జీజీయూ సిద్ధంగా ఉందన్నారు. అందుబాటులో ఉన్న వనరులతోనే ఈ స్టార్టప్ తయారు చేశామని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ కేవీబీ రాజు, హెచ్ఓడీ డాక్టర్ బీవీఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్ ఫెస్టివల్‌ను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: రాజమహేంద్రవరంలో శుక్రవారం జరగనున్న 'అమరావతి చిత్రకళా వీధి – ఆంధ్రాస్ మోస్ట్ వైబ్రంట్ ఆర్ట్ ఫెస్టివల్'ను విజయవంతం చేద్దామని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్సిటీ సెమినార్ హాలులో ఇదే విషయమై ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.